www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 10 జనవరి 2025

11న భీమడోలులో మెగా మెడికల్ క్యాంప్

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ ఆధ్వర్యాన స్థానిక మానస ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఈ నెల 11న ఆంధ్ర హాస్పిటల్స్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు తెలిపారు. దీనిలో వైద్యశాఖకు చెందిన ప్రముఖ వైద్య నిపుణులు గుండె, జనరల్, గైనిక్, ఆర్థోపెడిక్ విభాగాలకు చెందిన వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. శిబిరంలో ఉచిత ఇసిజి సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. రోగుల వ్యాధి తీవ్రత మేరకు ఉచితంగా మందులు పంపిణీ సౌకర్యం ఉందన్నారు. కార్యక్రమానికి ఏలూరు ఎంపితోపాటు ఎంపిఎల్ పత్సమట్ల ధర్మరాజు, జెడిపి వైస్ చైర్మన్ జి.పద్మశ్రీ పాల్గొంటారన్నారు. భీమడోల పరిసర ప్రాంత గ్రామాలకు చెందిన ప్రజలు మెగా మెడికల్ క్యాంపు సేవలను వినియోగించుకోవాలని గన్ని విజ్ఞప్తి చేశారు.

ఎదురుచూపులేనా..!

ఏడు నెలలైనా అమలు కాని కీలక హామీలు
అమ్మకు వందనం, అన్నదాత సుఖీభవ ఎప్పుడో..?
18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500,
నిరుద్యోగ భృతిపై సర్వత్రా చర్చ
చంద్రన్న బీమా అమలుపైనా నిర్లక్ష్యమే
సంక్రాంతి కానుకకు తిలోదకాలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలకు ఎదురుచూపులే మిగులుతున్నాయి. సూపర్ సిక్స్ పేరుతో కూటమి ఇచ్చిన కీలక హామీలకు సైతం అధికారం చేపట్టి ఏడు నెలలు గడిచినా మోక్షం లేని పరిస్థితి ఉంది. పథకాలకు పేర్లు ప్రకటించడమే తప్ప.. అమలు మాత్రం ముందుకు పడటం లేదు. కూటమి మేనిఫెస్టో హామీలపై ప్రజల్లో తీవ్ర చర్చ సాగుతోంది. గత ప్రభుత్వం పథకాల అమలు తీరుపైనా, ప్రస్తుత ప్రభుత్వం తీరుపై జనాల్లో చర్చ పెద్దఎత్తున సాగుతోంది. హామీల అమలులో తాత్సారంతో రైతులు, విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో దాదాపు 16 లక్షల వరకూ సాగుభూమి ఉంది. దాదాపు ఎనిమిది లక్షల మంది రైతులు వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్నారు. వ్యవసాయం కష్టాల సాగుగా మారడంతో ప్రభుత్వ సాయం రైతులకు ముఖ్యంగా మారింది. తాము అధికారంలోకి వస్తే అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇస్తామంటూ కూటమి నేతలు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఏడు నెలలు గడిచిపోయింది. ఖరీఫ్ పూర్తయ్యింది. రబీ ముమ్మరంగా సాగుతోంది. పెట్టుబడి సాయం మాత్రం అందలేదు. రైతులకు అత్యంత ముఖ్యమైన హామీని సైతం సకాలంలో అమలు చేయకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కౌలుచట్టంలో మార్పులు చేస్తామనే మాటను సైతం ప్రభుత్వం ఇప్పటికీ నెరవేర్చలేకపోయింది. ఒకటి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న కుటుంబంలోని ఒక విద్యార్థికి గత ప్రభుత్వం అమ్మఒడి పేరుతో ఏడాదికి రూ.15 వేలు జమ చేసింది. తాము అధికారంలోకి వస్తే కుటుంబంలో చదువుకుంటున్న ప్రతి పిల్లాడికీ అమ్మకి వందనం కింద రూ.15 వేలు చొప్పున ఇస్తామని కూటమి నేతలు చెప్పారు. ఇప్పటి వరకూ అమలు కాలేదు. జిల్లాలో ఒకటి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న విద్యార్థులు ఐదు లక్షలకుపైగా ఉన్నారు. విద్యా సంవత్సరం ముగింపు దశకు చేరుతోంది. ప్రయివేటు స్కూళ్లలో ముక్కుపిండి ఫీజు వసూలు చేస్తున్నారు. అమ్మకు వందనం సొమ్ములేస్తే పిల్లల ఫీజులకు ఉపయోగపడతాయని తల్లిదండ్రులు ఎదురుచూస్తూనే ఉన్నారు. ఎప్పుడు వేస్తారో కనీసం ప్రకటించని పరిస్థితి నెలకొంది. 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మధ్య మహిళలకు నెలకు రూ.1500 జమ చేస్తామని చెప్పారు. అది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉంది. ఉద్యోగాలు వచ్చే వరకూ యువతకు నిరుద్యోగ భృతి కింద నెలకు రూ.మూడు వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అసలు అమలు చేస్తారా అనే అనుమానాలు నెలకొన్నాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై మాటలు తప్ప ఆచరణ లేకుండాపోయింది. సూపర్ సిక్స్ పేరుతో ప్రభుత్వం చెప్పిన కీలక హామీల్లో ఉచిత గ్యాస్ పథకం ఒక్కటే ఇప్పటి వరకూ అమలు చేసిన పరిస్థితి నెలకొంది.



చంద్రన్న బీమాపైనే నిర్లక్ష్యం

ఇంట్లో కుటుంబ యజమాని మృతి చెందితే ఇచ్చే చంద్రన్న బీమా సైతం ఇప్పటికీ అమలుకు నోచుకోలేదు. సహజ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణానికి రూ.పది లక్షలు ఇస్తామని హామీ ఇచ్చారు. బీమా అంటే కష్టకాలంలో ఉపయోగపడేదని అర్థం. కుటుంబ యజమానిని కోల్పోయి ఎన్నో కుటుంబాలు దుర్భర స్థితిని అనుభవిస్తున్నాయి. ఈ ఏడు నెలల కాలంలో వందల కుటుంబాలు కుటుంబ పెద్దను కోల్పోయి కష్టాల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వారి పిల్లల చదువులకు, బతుకు సవ్యంగా సాగాలనే బీమా సొమ్ములు ఆధారంగా ఉంటాయి. పథకానికి పేరు ప్రకటించినా అమలు కాని పరిస్థితి నెలకొంది.

సంక్రాంతి కానుక తిలోదకాలు

2014-19 మధ్యలో టిడిపి ప్రభుత్వం సంక్రాంతి కానుక కింద నిత్యావసర సరుకులు అందించింది. గత వైసిపి ప్రభుత్వం దీన్ని నిలిపివేసింది. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సంక్రాంతి కానుక ఇస్తామని అప్పట్లో ప్రకటించారు. మరో నాలుగు రోజుల్లో సంక్రాంతి పండుగ రానుంది. సంక్రాంతి కానుక ఊసే లేకుండాపోయింది. ముఖ్యమైన పథకాల అమలులోనూ ప్రభుత్వం తాత్సారం వహిస్తుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలివే..

1.యువతకు 20 లక్షల ఉద్యోగాలు, నెలకు రూ.మూడు వేల నిరుద్యోగ భృతి
2.స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు
3.ప్రతి రైతుకూ ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
4.ప్రతి మహిళకు నెలకు రూ.1500 (19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల వరకూ)
5.ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు
6.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం
వీటిలో ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ఒక్కటే అమల్లోకి వచ్చింది.

ఆ పంచాయతీలపై విచారణకు ఆదేశం

ఏలూరు డిపిఒ కె.అనురాధ - 'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

క్రొవ్విడి, మందలపర్రు, గుణపర్రు పంచాయతీల వెండర్ ఖాతాల్లో జరిగిన బిల్లుల చెల్లింపులపై విచారణకు ఆదేశించినట్లు జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ తెలిపారు. గురువారం 'పంచాయతీల్లో వెండర్ మాయాజాలం' అంటూ నిడమర్రు మండలం క్రొవ్విడి, మందలపర్రు, గుణపర్రు పంచాయతీలపై 'ప్రజాశక్తి'లో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. దీనిపై ఏలూరు డిఎల్‌పిఒ కెపి.చంద్రశేఖర్ విచారణ చేసి నివేదిక ఇవ్వాలన్నారు. విచారణలో తప్పు చేసినట్లు తేలితే చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు డిపిఒ తెలిపారు.

కొనసాగిన పీసా కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో పీసా కమిటీల ఎన్నికలు మూడో రోజు గురువారం ప్రశాంతంగా సాగాయి. కొత్త చీమలవారిగూడెంలో పీసా కమిటీ ఉపాధ్యక్షులుగా సిపిఎం నేత నారం మల్లేశ్వరరావు, కార్యదర్శిగా కారం రవి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎస్. బుచ్చయ్య తెలిపారు. బర్రింకలపాడులో పీసా కమిటీ ఉపాధ్యక్షునిగా పొట్ట కామరాజు, కార్యదర్శిగా కుంజా భీముడు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి నిఖిల్ మధు శరణ్ తెలిపారు. వంకవారిగూడెంలో కోరం లేక ఎన్నిక రద్దయినట్లు ఎన్నికల అధికారి కె.శ్రీనివాస్ తెలిపారు.



బిఫాం అందుకుంటున్న సిపిఎం నేత మల్లేశ్వరావు

బుట్టాయగూడెం: మండలంలో గురువారం పీసా కమిటీ ఎన్నికలు మూడోరోజు కొనసాగాయి. మండలంలో 20 గ్రామాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా కంగలవారిగూడెం, చింతలగూడెం, నిమ్మలగూడెం, కొమ్ముగూడెం, పులిరాముడు ముద్దప్పుగూడెం గ్రామాల్లో కోరం లేక ఎన్నికలు నిర్వహించలేదు. మిగిలిన 16 గ్రామాల్లో ఎన్నికలు జరిగాయి. బూసరాజుపల్లి పెసా కమిటీ ఉపాధ్యక్షునిగా పుసం ముత్యాలరావు, కార్యదర్శిగా తుష్టి రాజశేఖర్, మంగయ్యపాలెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా తెల్లం వెంకటేష్, కార్యదర్శిగా దాడి మారయ్య, కన్నారప్పాడు పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా పాములేటి కన్నెపరెడ్డి, కార్యదర్శిగా మాండ్రు వెంకటరెడ్డి, ముంజులూరు పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కచ్చల రామిరెడ్డి, కార్యదర్శిగా నడపాల రవీంద్రరెడ్డి, బొత్తప్పగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా పోడియం కృష్ణ, కార్యదర్శిగా కానెం వెంకటేశ్వరరావు, నూతిరామన్నపాలెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కూరం వెంకటస్వామి, కార్యదర్శిగా పోడియం శ్రీను, గోగుమిల్లి పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా మాండ్రు బాలురెడ్డి, కార్యదర్శిగా వేట్ల చెన్నారెడ్డి, కోపల్లి, వీరన్నపాలెం పెసా కమిటీ ఉపాధ్యక్షుడిగా కచ్చల పోతిరెడ్డి, కార్యదర్శిగా సున్నం రాజేష్, గుమ్ములూరు పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా వేట్ల చిన్నారెడ్డి, కార్యదర్శిగా కత్తుల కన్నపురెడ్డి, రాజానగరం, పాత రాజానగరం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా వెట్టి నాగరాజు, కార్యదర్శిగా వెట్టి సురేష్, రెడ్డిగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కోపాల లచ్చిరెడ్డి, కార్యదర్శిగా కొండల కృష్ణారెడ్డి, రవ్వారిగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా మడకం సిరమరాజు, కార్యదర్శిగా కొవ్వాసి కొండలరావు, మెరకగూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కురసం నాగ పృథ్వీ, కార్యదర్శిగా కూరం పండు, బుద్ధులవారి గూడెం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా కోర్సా రామలక్ష్మి, కార్యదర్శిగా బి.వినోద్‌కుమార్ ఎన్నుకున్నారు.

కుక్కునూరు రూరల్: మండలంలో మూడో రోజు పీసా కమిటీ ఎన్నికలు కొనసాగాయి. దాచారం పంచాయతీలోని పంచాయతీలోని లచ్చిగూడెం పీసా కమిటీ ఉపాధ్యక్షుడిగా సున్నం శివకృష్ణ, కార్యదర్శిగా సున్నం వెంకటలక్ష్మి, అరవపల్లి పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా సోడే చంద్రం, సీతారామనగరం పెసా కమిటీ ఉపాధ్యక్షులుగా వరుస రవికుమార్, కార్యదర్శిగా కనుతి నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. కోరం పూర్తి కానందున దాచారం పంచాయతీలోని నెమలిపేట, పాతూరు, గొమ్ముగూడెం పంచాయతీలోని మద్దిగట్ల, శ్రీధర పంచాయతీలోని శ్రీధర సీతారామనగరం పంచాయతీలోని సీతారామనగరం గ్రామాల్లో పీసా కమిటీల ఎన్నికలు నిలిపివేసినట్లు ఎంపిడిఒ నరసింహారావు తెలిపారు.

పోలవరం: మండలంలో మామిడిగొంది, గార్లగొయ్యి, గుంజవరం గ్రామాల్లో పీసా కమిటీ ఎన్నికలు గురువారం ఏకగ్రీవమయ్యాయి. ప్రగడపల్లి, రేపల్లెవాడ, శివగిరి, ఎల్ఎన్‌డిపేట, కొండ్రుకోట, కొత్తమామిడిగొంది గ్రామాల్లో పీసా ఎన్నికలు కోరం లేకపోవడం వల్ల వాయిదా పడ్డాయి. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఇ.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లో పీసా ఎన్నికల నిర్వహణ కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తామని తెలిపారు.

రూ.300 వేతనం అందేలా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలి

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎంవిఆర్.కృష్ణతేజ

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న కృష్ణతేజ

శిక్షణా కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద గ్రామాల్లో చేపడుతున్న పనులను అర్హులు పొందేలా చూడటంతోపాటు వారికి కనీస వేతనం రూ.300 వచ్చేలా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎంవిఆర్.కృష్ణతేజ తెలిపారు. గురువారం స్థానిక క్రాంతి కళ్యాణ మండపంలో జిల్లాస్థాయి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ క్షేత్ర సహాయకుల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం ప్రణాళికాబద్ధంగా పనులు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండుగ ద్వారా రూ.4,500 కోట్లతో 3,500 కిలోమీటర్ల మేర సీసీ, బిటి రోడ్లు నిర్మాణం, మరమ్మతులు చేపట్టిందన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పనుల నివేదిక ప్రకారం మట్టి పనిచేసే ఉపాధి కూలీలు పొందుతున్న వేతనం వివరాలను తెలుసుకుని మరింత ఎక్కువ వేతనం పొందేలా జిల్లాలో ఫీల్డ్ అసిస్టెంట్లు ఈ శిక్షణ ఉపయోగించుకోవాలన్నారు. ప్రతి కూలీకి రూ.300 వేతనం అందేలా ఫీల్డ్ అసిస్టెంట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల విధులు, బాధ్యతలు, జాబ్‌కార్డ్ ముఖ్య సూచనలు, పనికి దరఖాస్తు, శ్రమశక్తి సంఘాల ఏర్పాటు, జాతీయ చరవాణి పర్యవేక్షణ వ్యవస్థ, మస్టర్ నిర్వహణ, డిమాండుకు తగ్గట్టు అనుసరించాల్సిన వ్యూహం, కందకాలు పీటర్ కాలువలు చెరువు కట్టల పునరుద్ధరణ పనుల వివరణ నమోదు రిజిస్టర్ తదితర అంశాలపై శిక్షణిచ్చారు. కార్యక్రమంలో ఇజిఎస్ పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి డైరెక్టర్ వైవి.షణ్ముఖకుమార్, పంచాయతీరాజ్ శాఖ అడిషనల్ కమిషనర్ మల్లెల శివప్రసాద్, డ్వామా పీడీ కె.వెంకటసుబ్బారావు, జెడ్‌పి సిఇఒ సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ డాక్టర్ విజయరాజు, డిపిఒ కె.అనురాధ, ఎపీడీలు ఎ.పురుషోత్తమరావు, డి.దామోదర్‌రావు, పి.శ్రీదేవి, జిల్లాలోని ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రెవెన్యూ సేవల్లో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యం

అర్జీల పరిష్కారానికి అత్యధిక ప్రాధాన్యత

రెవెన్యూ అధికారుల సమీక్షా సమావేశంలో కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

భూముల రీ సర్వేకు సంబంధించి అర్జీలను ప్రణాళిక బద్ధంగా జనవరి 31వ తేదీలోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డితో కలిసి రెవెన్యూ అధికారులతో కలెక్టర్ వెట్రిసెల్వి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, భూసేకరణ, రీసర్వే, నిషేధిత భూములు, కోర్టు కేసులు తదితర అంశాలపై రెవెన్యూ అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు తమ పనితీరు మెరుగుపర్చుకుని శాఖ ప్రతిష్టను పెంచేందుకు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. పనితీరు కనపరిచే తహశీల్దార్లకు ర్యాంకింగ్ ఇస్తామని, ఉత్తమ తహశీల్దార్లను సత్కరిస్తామన్నారు. రెవెన్యూ సేవల్లో వేగం, నాణ్యత, పారదర్శకత ముఖ్యమన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, భూసేకరణ అంశాలకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఫ్రీహోల్డ్ భూములు, 22ఎ నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన ప్రొఫార్మా ప్రకారం కచ్చితమైన సమాచారంతో నివేదిక సమర్పించాలని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్ కాలనీలను పరిశీలించి ఖాళీ స్థలాల వివరాలను నెలాఖరులోపు సమర్పించాలన్నారు. జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ సమస్యల పరిష్కారం కోసం 6,453 అర్జీలు రాగా వాటిలో ఇప్పటికే 3,312 అర్జీలు పరిష్కరించినట్లు చెప్పారు. మిగిలినవి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా నూరుశాతం అర్జీలు పరష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రతిభ కనబరచిన తహశీల్దార్లకు ర్యాంకింగ్‌లు

గత నవంబరులో జరిగిన రెవెన్యూ అధికారుల సమావేశంలో కలెక్టర్ పేర్కొన్న విధంగా రెవెన్యూకు సంబంధించి వివిధ అంశాల్లో ప్రతిభ కనబరచినవారికి ర్యాంకింగ్‌లను ప్రకటించారు. భీమడోలు తహశీల్దార్ రమాదేవి మొదటి ర్యాంకును సాధించగా చింతలపూడి, పెదపాడు తహశీల్దార్లు ప్రమద్వార, కృష్ణజ్యోతి ద్వితీయ, తృతీయ ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా మొదటి ర్యాంకు సాధించిన భీమడోలు తహశీల్దార్ బి.రమాదేవికి బెస్ట్ ఫెర్‌ఫార్మింగ్ మెమెంటో అందించి శాలువతో కలెక్టర్ వెట్రిసెల్వి సత్కరించారు.

జాతీయస్థాయి పోటీలకు వంశీసాగర్

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వంశీసాగర్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

మండల పరిధిలోని ఎన్ఆర్ఐ కళాశాలలో ఎంబిఎ మొదటి సంవత్సరం చదువుతున్న వంశీసాగర్ జాతీయస్థాయి జూడో పోటీలకు అర్హత సాధించినట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.గౌతు తెలిపారు. ఎల్ఎన్‌సిటియు యూనివర్శిటీ మధ్యప్రదేశ్ వారు నిర్వహించిన సౌత్, వెస్ట్ ఇంటర్ యూనివర్శిటీ జోన్‌లో ఉత్తమ ప్రతిభ కనపరినందుకు వంశీసాగర్ ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు పంజాబ్ రాష్ట్రంలోని గురునానక్ దేవ్ యూనివర్శిటీ వారు నిర్వహించనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ జూడో పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వంశీసాగర్‌ను కళాశాల ఛైర్మన్ డాక్టర్ రావివెంకట్రావు, ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, ఎఒ ఎన్.మాధవరావులు అభినందించారు.

వాహన పన్ను జరిమానాలను చెల్లించండి

జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ షేక్‌కరీం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వాహనాలకు పన్ను చెల్లించాల్సిన యజమానులు ఈ త్రైమాసిక పన్నును ముందుగానే చెల్లించాలని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ షేక్ కరీం తెలిపారు. ఈ క్వార్టర్ నుంచి వాహన వెబ్‌సైట్ (నేషనల్ సాఫ్ట్‌వేర్) ద్వారా పన్నులు చెల్లించే కారణంగా ముందుగానే ఆయా వాహన సంబంధిత మండల మ్యాపింగ్, ఈ కెవైసిలు వెబ్‌సైట్‌లో నమోదు చేయించుకోవాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో మోటారు వాహన కేసులు బకాయి ఉంటే త్వరితగతిన ఆ రాష్ట్రాల్లోనే అపరాధ రుసుం చెల్లించాలని సూచించారు. లేకపోతే ఆన్‌లైన్‌లో ట్యాక్స్ తీసుకోరన్నారు. వాహనదారులు పెండింగ్‌లో ఉన్న తమ వాహన పన్ను జరిమానాలను వెంటనే చెల్లించి సహకరించాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా జరిమానా చెల్లించని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆఖరి రోజు వరకు ఉండి సాంకేతిక పరమైన సమస్యలతో ఇబ్బంది పడకుండా మోటారు వాహనాల యజమానులు ముందస్తుగానే పన్నులు చెల్లించడం వల్ల సమస్యలు పరిష్కరించుకోవచ్చని షేక్ కరీం తెలిపారు.

విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలను రద్దు చేయాలి

సిపిఎం ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ముదినేపల్లి

నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు

ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్ ఛార్జీలను వెంటనే రద్దు చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.మహంకాళిరావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గురజ రోడ్డు సెంటర్లో సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహంకాళిరావు మాట్లాడుతూ ఎప్పుడో వాడిన కరెంటుకు ఛార్జీలు సరిపోలేదని ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై ఇప్పుడు భారాలు వేయడం సరికాదన్నారు. ఈ నెల 13న విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు చిన్నం మాధవ, జక్కుల మహేష్, మోహనరావు పాల్గొన్నారు.

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ఈ నెల 30న నిర్వహించనున్న బాలోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ నెల 30న జరిగే బాలోత్సవాన్ని జయప్రదం చేయాలని నిర్వాహక కమిటీ నేతలు కోరారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బివిబి.కోటేశ్వరి, కె.గంగాయుడు, ఎంఆర్.హనుమాన్లు, డి.మోహన్ రావు, బి.అనురాధ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలను, జూద క్రీడలను అడ్డుకోండి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ఏలూరు : సంక్రాంతి సంబరాల పేరిట కోడిపందేలు, జంతుహింస జరుగకుండా నియంత్రణా చర్యలు చేపట్టాలని, హైకోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లాలో రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కూడిన జాయింట్ యాక్షన్ కమిటీలను నియమిస్తూ జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఉత్తర్వులు జారీ చేశారు. సంక్రాంతి సంబరాల పేరిట కోడిపందేలు, జూదాలు జరుగకుండా చూసేందుకు జిల్లాలో అన్ని మండలాల్లో 28 సంయుక్త తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు గట్టి నిఘాతో తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఈ కమిటీల్లో ఆయా మండల తహశీల్దార్, ఎస్‌హెచ్ఒ, ఎన్‌జిఒ ప్రతినిధి, ఇద్దరు కానిస్టేబుల్స్, ఇద్దరు వీడియో గ్రాఫర్లతో కూడిన బృందాలను ఏర్పాటు చేశారు. కోడిపందేలు, బెట్టింగులు, జూదాలు తదితర సామాజిక దురాచారాల నియంత్రణకు ఈ కమిటీలు పనిచేస్తాయన్నారు.

కోడిపందేలు ఆపండి

హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాశక్తి - దెందులూరు

దుగ్గిరాల గ్రామ సమీపంలో, జిల్లాలో ఎక్కడా కూడా కోడిపందేలు, జూదాలు వంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకోవాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా వ్యవహరించాలని సామాజిక కార్యకర్త ఘంటసాల వెంకటలక్ష్మి, ఏలూరు నగరానికి చెందిన బలే నాగలక్ష్మి అన్నారు. సంక్రాంతి పండుగ ముసుగులో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పేరుతో దెందులూరు నియోజకవర్గం, దుగ్గిరాల గ్రామ సమీపంలో కోడిపందేలు, జూదాల కోసం భారీ ఎత్తున జరుగుతున్న ఏర్పాట్లను అడ్డుకోవాలని సామాజిక కార్యకర్త ఘంటసాల వెంకటలక్ష్మి సహకారంతో ఏలూరు నగరానికి చెందిన బలే నాగలక్ష్మి హైకోర్టు న్యాయవాది డి.తారకప్రసాద్ ద్వారా హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి వినతి పత్రం అందించారు. సంక్రాంతి పండుగ జూదాలు వంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు దుగ్గిరాల గ్రామ సమీపంలో జరగకుండా అడ్డుకోవాలంటూ అందులో పేర్కొన్నారు. జిల్లాలో కూడా ఎక్కడా కూడా కోడిపందేలు, జూదాలు వంటి అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా అడ్డుకోవాలంటూ కోరుతూ ఈ వ్యాజ్యాన్ని స్వీకరించిన హైకోర్టు ఈ నెల ఎనిమిదో తేదీన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రవి చీమలపాటి నేతృత్వంలోని ధర్మాసనం ఈ వ్యాజ్యంపై విచారణ జరిపి, సంక్రాంతి పండుగ సందర్భంగా దుగ్గిరాల గ్రామ సమీపంలో, జిల్లాలో ఎక్కడా కూడా కోడిపందేలు, జూదాలు జరగకుండా చట్టాలను కఠినంగా అమలు చేయాలంటూ, గతంలో హైకోర్టు ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాలంటూ సంబంధిత పోలీసులకు, రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు పాటించకపోతే ఈ నెల 20వ తేదీ తరువాత కోర్టు ధిక్కరణ కింద మళ్లీ హై కోర్టును ఆశ్రయించవచ్చని ప్రధాన న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

కూల్చేసిన వారే పునఃనిర్మించాలి

బుట్టాయగూడెం సిపిఐ కార్యాలయ కూల్చివేతపై వామపక్షాల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఆందోళన చేస్తున్న వామపక్షాలు

బుట్టాయగూడెంలో సిపిఐ కార్యాలయాన్ని కూల్చివేసిన బాధ్యులే పున:నిర్మించాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ బుట్టాయిగూడెం కార్యాలయ కూల్చివేతను నిరసిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వనజ మాట్లాడుతూ గత డిసెంబరు 26న సిపిఐ శత వార్షికోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో బుట్టాయగూడెంలో నిర్మిస్తున్న సిపిఐ కార్యాలయాన్ని స్థానిక తహశీల్దార్ ఎటువంటి నోటీసూ జారీ చేయకుండా పోలీసు సిబ్బందితో కూల్చివేయడం అప్రజాస్వామిక చర్యని విమర్శించారు. తహశీల్దార్ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి కుట్రపూరితంగా కార్యాలయం కూల్చివేయడం సభ్యసమాజానికి సిగ్గుచేటన్నారు. కనీసం కార్యాలయంలోని మెటీరియల్, వంట సామగ్రి బయటకు తెచ్చుకునే అవకాశం కూడా లేకుండా దుర్మార్గంగా వ్యవహరించారన్నారు. ఒకవేళ సిపిఐ కార్యాలయం ప్రభుత్వ భూమిలో ఉందనుకుంటే కనీసం నోటీసు ఇవ్వరా అని ప్రశ్నించారు. ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ భూముల సంగతేంటని నిలదీశారు. ఈ ఘటనకు బాధ్యుడైన తహశీల్దార్‌ను సస్పెండ్ చేయాలని, లేనిపక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీల కార్యాలయాలు ప్రజా సమస్యల పరిష్కారానికి కేంద్ర బిందువుగా ఉంటాయన్నారు. తహశీల్దార్ వైఖరి అత్యంత దారుణమన్నారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కమిటీ సభ్యులు కాకి నాని, ఎంసిపిఐ నాయకులు నాగరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, సిపిఐ నేతలు ఎమ్‌డి.మున్సీరు, బండి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి హేమశంకర్, సిఐటియు నేత బి.సోమయ్య పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

మండవల్లి సబ్ రిజిస్ట్రార్‌గా బాలాజీ


బాలాజీ

ప్రజాశక్తి - మండవల్లి

మండవల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి నూతన సబ్ రిజిస్ట్రార్‌గా బాలాజీ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో తాడేపల్లిలోని ఐజి కార్యాలయంలో హెడ్‌క్లర్క్ పని చేస్తున్న ఆయనను మండవల్లికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన గురువారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చేరుకుని ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరగకపోవడంతో ఆదాయం తగ్గిపోయిందన్నారు. లక్ష్యం కంటే ఐదు రెట్లు తక్కువగా వస్తుందని, దీంతో ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారని, రెవెన్యూ పెంచేలా అన్ని చర్యలు తీసుకుంటానని చెప్పారు. మండలంలోని రైతులు సద్వినియోగం చేసుకుని సకాలంలో రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని ఆయన కోరారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి ఏలూరు సిటీ

సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంపొందించుకుని విద్యార్థులంతా కంప్యూటర్ విద్యలో పూర్తిస్థాయిలో ప్రావీణ్యత సాధించాలని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి సూచించారు. ఏలూరు అగ్రహారంలోని కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో ఐడిబిఐ బ్యాంక్ సౌజన్యంతో సమకూర్చిన 11 కంప్యూటర్లతో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. తొలుత ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎంఎల్ఎ చంటికి ఆత్మీయ స్వాగతం లభించింది. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఆయన ఒక కంప్యూటర్‌కు స్విచ్ఛాన్ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలానికి తగ్గట్లుగా విద్యార్థులంతా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ అందించేందుకు కార్పొరేషన్ ద్వారా అవుట్ సోర్సింగ్ విధానంలో ఒక ఉపాధ్యాయుడిని కూడా నియమిస్తామని హామీ ఇచ్చారు.

ముసునూరు తహశీల్దార్‌గా పురుషోత్తమవర్మ

పురుషోత్తమవర్మ

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు తహశీల్దార్‌గా జి.పురుషోత్తమవర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందుబాటులో ఉంటూ తమ సేవలను కొనసాగిస్తానన్నారు. విద్యార్థులకు కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సకాలంలో ఇచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. మండలంలోని 16 గ్రామాల్లో కొన్ని గ్రామాల్లో గత ప్రభుత్వం రీ సర్వే చేపట్టిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మిగిలిన గ్రామాల్లో రీ సర్వే కొనసాగిస్తామన్నారు.

తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై విచారణ జరపాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

తిరుమల తిరుపతి దేవస్థానం క్యూలైన్ తొక్కిసలాట ఘటనపై సమగ్ర విచారణ జరపాలని, కారకులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనపై టిటిడి పాలకమండలి బాధ్యత వహించాలని, మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్ట పరిహారం చెల్లించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యంతో పాటు రూ.25 లక్షల నష్ట పరిహారం అందించాలని తెలిపారు. యాత్రికులకు భోజనం, తాగునీరు, మరుగుదొడ్ల వంటి కనీస సౌకర్యాలు కల్పించడంలో టిటిడి పాలక మండలి పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. యాత్రికులకు కనీస సౌకర్యాలు చూపకపోవడం దారుణమని తెలిపారు.

మహిళలను గౌరవించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

మహిళలను గౌరవించి, సన్మానించడం ప్రతిఒక్కరి బాధ్యత అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.సురేష్ వివరించారు. స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా గురువారం బేటీ సమ్మాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పురస్కరించుకుని విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పావని, సిఐ రవీంద్రనాథ్, ఇతర రక్షణ సిబ్బంది విద్యార్థులు మద్దతుగా ర్యాలీకి సహకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సృష్టికి మూలమైన స్త్రీని ప్రతిఒక్కరూ గౌరవించాలన్నారు. ఆనాడైనా ఎందరో స్త్రీమూర్తులు తమ శక్తిని నిరూపించుకుంటూ స్త్రీ అబల కాదు సబల అని రుజువు చేశారన్నారు. స్త్రీ సాధికారత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని నినదిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఉదయభాస్కర్, కో-ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు టి.సురేష్, ఎఒ రవీంద్ర, డీన్ మధుబాబు, ఇన్‌చార్జులు, టీచర్లు, విద్యార్థులు వారి మాతృమూర్తులు పాల్గొన్నారు.

కాపు జెఎసి జిల్లా యూత్ అధ్యక్షునిగా సుబ్రహ్మణ్యం


సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - కలిదిండి

కాపు జెఎసి జిల్లా యూత్ అధ్యక్షులుగా జడ్డు సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. రాష్ట్ర కాపు జెఎసి ఛైర్మన్ అమ్మ శ్రీనివాస్ నాయుడు ద్వారా నియామక పత్రం అందుకున్నట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు. జిల్లాలో కాపు సామాజిక తరగతి ఆర్థిక, సామాజిక ఎదుగుదలతో పాటు సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. అన్ని మండలాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి మండల కమిటీలు ఏర్పాటు చేసి తద్వారా సమస్యల పరిష్కారానికి ముందుంటానన్నారు. తన ఎన్నికకు సహకరించిన అమ్మ శ్రీనివాస్ నాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సుబ్రహ్మణ్యం ఎన్నిక పట్ల ఆ సామాజిక తరగతి పలువురు నాయకులు హర్షం వ్యక్తం చేసి, అభినందనలు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

చోరీ కేసుల్లో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - భీమడోలు

వివిధ జిల్లాల పరిధిలో జరిగిన దొంగతనాల్లో నిందితులుగా గుర్తించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.మూడు లక్షల విలువైన బంగారం, వెండి వస్తువులు, నగదులను స్వాధీనం చేసుకున్నట్లు ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ తెలిపారు. నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన చంద్రగిరి కిరణ్, తిరు న్నారాయణ, ఎల్లప్ప వసంత కుమార్ ముఠాగా ఏర్పడి భీమడోలు, చేబ్రోలు, నరసాపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డారు. దీనిపై ఎస్‌పి కె.ప్రతాప్ శివ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డిఎస్‌పి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో భీమడోలు సిఐ యుజె.విల్సన్ పర్యవేక్షణలో భీమడోలు ఎస్ఐ వై.సుధాకర్, ఆయన సిబ్బంది కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు నిందితులైన ముగ్గురిని భీమడోలు బస్టాండ్ సమీపంలో అదుపులోకి తీసుకుని చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు.

కోడిపందేల బరులు ధ్వంసం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని పట్టిసీమలో కోడి పందేల కోసం సిద్ధం చేసిన బరులను తహశీల్దార్ సాయిరాజు, ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా కోడిపందేలు, జూదాలు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

చెల్లని చెక్కు కేసులో మహిళకు జైలు, జరిమానా

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

చెల్లని చెక్కు కేసులో నిడమానూరుకు చెందిన బేబీసరోజినికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.35 లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వెల్లూరు కృష్ణమూర్తి గురువారం తీర్పునిచ్చారు. బేబీ సరోజినీ బాపులపాడు మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పూర్ణచంద్రరావు వద్ద మూడు దఫాలుగా రూ.30 లక్షలు అప్పు తీసుకుని మూడు చెక్కులను పూర్ణచంద్రరావుకు ఇచ్చింది. కొంతకాలం తర్వాత పూర్ణచంద్రరావు అప్పు తీర్చాలని అడగగా బేబీ సరోజినీ నిరాకరించింది. బేబీ సరోజినీ ఇచ్చిన చెక్కులను బ్యాంకులో వేయగా అవి చెల్లక వచ్చాయి. దీంతో పూర్ణచంద్రరావు కోర్టును ఆశ్రయించగా బేబీసరోజినికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.35 లక్షల జరిమానా విధిస్తూ స్పెషల్ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు.

ప్రజాశక్తి
ప్రతిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

11 నుంచి బాస్కెట్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలో దసరా ఉత్సవాలతో పాటు దేశవ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా శ్రీ రాజావెంకటాద్రి అప్పారావు బహదూర్ మెమోరియల్ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌ను ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నారని బాస్కెట్‌బాల్ ఆర్గనైజర్, కన్వీనర్ పశువులేటి సాధన తెలిపారు. ఈ కార్యక్రమం 1967లో ప్రారంభించి 47 ఏళ్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టోర్నమెంట్‌కి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి మహిళలు, పురుషులు పాల్గొంటారని తెలిపారు. ఈ విధంగా టోర్నమెంట్‌ను నిర్వహించడంలో భాగస్వాములైన పట్టణ ప్రముఖులు, పురజనులు, క్రీడాకారులు, అధ్యాపకులు, వాలంటీర్లందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం ఎన్నో రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న నూజివీడు ప్రతిష్టను ఇంకా ఇనుమడింప చేస్తూ పార్టీలకు అతీతంగా కుల, మత, ప్రాంతీయ తత్వ రహితంగా అందరం సమైక్య భావనతో క్రీడా స్ఫూర్తితో ఈ టోర్నమెంట్‌ని కొనసాగిస్తున్నామని తెలిపారు.

నాగేశ్వరరావు మృతి బాధాకరం

ప్రజాశక్తి - చింతలపూడి

టిడిపి కోసం అహర్నిశలు కష్టపడే నాయకులను కోల్పోవటం బాధాకరమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని ఎర్రంపల్లి గ్రామానికి చెందిన ఎంపిటిసి మాజీ సభ్యులు, టిడిపి సీనియర్ నాయకులు పాకనాటి నాగేశ్వరరావు మృతిచెందారు. ఆయన మృతదేహాన్ని ఎంఎల్ఎ సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ నాగేశ్వరరావు కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయనతో పాటు జగ్గవరపు ముత్తారెడ్డి, తాళ్లూరు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు మండల సర్వసభ్య సమావేశం ఈ నెల పదో తేదీ శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ జి.రాణి, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కొండా దుర్గాభవాని ఆధ్వర్యంలో మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచులు, మండల శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపడుతూ తీర్మానం చేపడతామని తెలిపారు.

'తప్పుడు ప్రచారాలు సరికాదు'

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బడుగు బలహీన తరగతులకు చెందిన పంట భూముల్లోకి వెళ్లే అధ్వాన రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేస్తుంటే అది చూసి ఓర్వలేని కొంతమంది తప్పుడు ప్రచారాలు చేయడం సరికాదని సర్పంచి కాపా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి నేత ఫ్యాక్టరీకి సీసీ రోడ్డు వేస్తున్నారని వైసిపి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సీసీ రోడ్డు పనుల వద్దకు కాపా శ్రీనివాసరావు గురువారం గ్రామస్తులతో కలిసి వెళ్లారు. ఎస్‌సి, బిసిలకు చెందిన పంట భూములకు సీసీ రోడ్డును వేయడం తప్పా అని ప్రశ్నించారు. గత వైసిపి హయాంలో రెండు సీసీ రోడ్లకు రూ.15 లక్షలు మంజూరైతే వైసిపి నాయకులు వారి ఇళ్లకెళ్లే రోడ్లకు సీసీ రోడ్లు వేయించుకున్నారన్నారు.

జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ఎవరైనా జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వీరభద్రుడు తెలిపారు. మండలంలోని పేరూరు గ్రామంలో గురువారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా మండలంలో కోడిపందేలు, పేకాట, ఇతర జూదాలు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. నిబంధన అతిక్రమించి ఎవరైనా జూదాలు నిర్వహిస్తే చట్టరీత్యా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

500 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు

ప్రజాశక్తి - కుక్కునూరు

కుక్కునూరు ఆశ్రమ బాలికల పాఠశాలలో సుమారు 500 మందికి పైగా విద్యార్థులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పంకజ్, చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి నవీన నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. గత రెండు రోజులు క్రితం కలెక్టర్ నిర్వహించిన మీటింగ్‌లో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగమ్మ ఏజెన్సీలో ఉన్న హాస్టల్ పదో తరగతి పిల్లలకు ప్రిపరేషన్‌కి నోట్ బుక్స్ కావాలని అడిగారు. దీంతో కలెక్టర్ వెట్రిసెల్వి స్పందించి జిల్లా విద్యా శాఖలో పనిచేస్తున్న ఎపిసి జిసి డియో నవీనతో ప్రత్యేకంగా పంపించి ఆ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. విద్యార్థులు కలెక్టర్ వెట్రిసెల్వికి ధన్యవాదాలు తెలిపారు. దీనిలో భాగంగా కుక్కునూరు మండలంలో ఉన్న కుక్కునూరు కెజిబివి, ఎలేరు కెజిబివిలను తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులను వారు రివిజన్ చేస్తున్న తరగతులను పరిశీలించారు. కుక్కునూరు మండలం లో ఉన్న పదో తరగతి విద్యార్థులను వారు రివిజన్ చేస్తున్న తరగతులను పరిశీలించారు. కెజిబివిలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పాల్ టాబ్స్ పంపిణీ చేశారు.

హమాలీల కూలీల పెంచే ఒప్పందాన్ని అమలు చేయాలి

ప్రజాశక్తి - భీమడోలు

రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ హమాలీలతో కూలీలు పెంచుతూ చేసుకున్న ఒప్పందాన్ని అమలు చేయాలని, తక్షణమే జిఒ రూపంలో విడుదల చేయాలని పాతూరు పౌర సరఫరాల సంస్థ హమాలీల యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు కోరారు. గోదాముల వద్ద గురువారం యూనియన్ సమావేశాన్ని నిర్వహించారు. కె.రాంబాబు సమావేశానికి అధ్యక్షత వహించి సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన లింగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రెండేళ్లకు ఒక పర్యాయం గోదాముల వద్ద పనిచేసే హమాలీల కూలీలను పెంచుతూ నిర్ణయం తీసుకుంటుందని, ఈ పర్యాయం నిర్ణయం గడువు జనవరి నెల 2024వ సంవత్సరంతో ముగిసినప్పటికీ ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. నూతన ప్రభుత్వంలో ఆ శాఖ మంత్రిగా పనిచేస్తున్న నాదెండ్ల మనోహర్ హమాలీల కూలీలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నప్పటికీ, ఇప్పటివరకు సంబంధిత జిఒను విడుదల చేయలేదని తెలిపారు. గత ప్రభుత్వం ఈ విషయాన్ని అసలు పట్టించుకోలేదని విమర్శించారు. ఇకనైనా మంత్రి హమాలీల కూలీలు పెంచుతూ సంబంధిత జిఒను విడుదల చేయకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు కె.వెంకటేశ్వరరావు, హమాలీల యూనియన్ జిల్లా కార్యదర్శి దుర్గారావు పాల్గొన్నారు.

పాతూరు గోదాముల హమాలీల నూతన కార్యవర్గం ఎంపిక

పౌరసరఫరాల సంస్థ పాతూరు గోదాముల హమాలీల యూనియన్ నూతన అధ్యక్షులుగా ఎర్రబోలు శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఉపాధ్యక్షులుగా బొడ్డుపల్లి అప్పలనాయుడు, కార్యదర్శిగా కోన వెంకటేశ్వరరావు, మేస్త్రిగా కె.త్రినాథ సోమేశ్వరరావు ఎంపికయ్యారు. పలువురు నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

విద్యార్థులకు యుటిఎఫ్ స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

స్థానిక అశోకవర్ధన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అల్లాడ పార్వతి అదే పాఠశాలలో పనిచేస్తూ తంగేళ్లమూడి ఆదిఆంధ్ర పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిగా ఉద్యోగోన్నతి పొందిన హైమావతిల ఆర్థిక సహకారంతో ఏలూరు వన్‌టౌన్‌లో ఉన్న బిజెటిఒ నగరపాలక ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ స్టడీ మెటీరియల్‌ను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు షడ్రక్ చేతుల మీదుగా మెటీరియల్ అందించారు. యుటిఎఫ్ ఏలూరు నగర శాఖ అధ్యక్షురాలు షేక్ పర్వీన్ బేగం, ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావు, కోశాధికారి కోరాడ కిరణ్‌కుమార్, జిల్లా కౌన్సిలర్ కెవి.అప్పారావు ఆధ్వర్యంలో విద్యార్థులకు వారి తల్లిదండ్రుల, పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆర్థిక సహకారం అందించిన పార్వతి, హైమావతిలను పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

స్థానిక మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు షేక్ పర్వీన్ బేగం, ఎమ్‌డి.జిక్రియా ఆర్థిక సహకారంతో అదే పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న విద్యార్థులందరికీ యుటిఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఖాజిదా బేగం చేతులమీదుగా విద్యార్థులకు వారి తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఆర్థిక సహకారం అందించిన పర్వీన్ బేగం, జిక్రియా ను పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

విద్యార్థులు జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి

ప్రజాశక్తి - మండవల్లి

విద్యార్థులు కౌమార దశలో హార్మోన్స్ ప్రభావంతో వచ్చే ఆలోచనలను నిగ్రహంతో ఎదుర్కొని జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని చైల్డ్ ప్రొటెక్ట్ కో-కన్వీనర్ సూర్య చక్రవేణి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన భేటీ బచావో బేటి పడావో కార్యక్రమంలో ఆమె గురువారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నతంగా చదువుకుంటేనే జీవితం బంగారుమయం అవుతుందన్నారు. లేనిపోని ఆలోచనలతో జీవితాన్ని పెడద్రోవ పాలు చేయరాదన్నారు. బాల్యవివాహాల వల్ల చిన్నారుల జీవితాలు అర్ధంతరంగా నాశనం అయిపోతాయని, జీవితంలో ఎన్నో అనర్థాలను ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వాటిని అడ్డుకునే విధంగా అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్ట్ కన్వీనర్ దుర్గాప్రసాద్ సిడిపిఒ దీప్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్, సూపర్‌వైజర్ నాగలక్ష్మి, మహిళా పోలీస్ గాయత్రి, ఎఎన్ఎం కనకదుర్గ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్‌ఎంపివిని ఎదుర్కొనేందుకు సన్నద్ధం

ఏలూరు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎంఎస్.రాజు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

హెచ్‌ఎంపి వైరస్‌ను ఎదుర్కొవటానికి అన్ని రకాలుగా సన్నద్ధంగా ఉన్నామని ఏలూరు సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్.రాజు తెలిపారు. సర్వజన ఆసుపత్రిలో హెచ్‌ఎంపివి వైరస్ సోకిన రోగుల కోసం ఒక్కో వార్డులో పది పడకల చొప్పున రెండు ప్రత్యేక వార్డులతోపాటు ఐసియులో రెండు ప్రత్యేక పడకలు కేటాయించారు. ఈ నేపథ్యంలో ఆయన గురువారం ప్రజాశక్తితో మాట్లాడారు. కమ్యూనిటీ మెడిసిన్ హెచ్‌ఒడి డాక్టర్ గంగాభవాని నోడల్ అధికారిగా, మరో ఐదుగురు వైద్యుల బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వైరస్ సోకిన వ్యాధిగ్రస్తులు ఎవరైనా వస్తే వీరి పర్యవేక్షణలో చికిత్స అందిస్తారని చెప్పారు. ఆక్సిజన్, వెంటిలేషన్ వంటి సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని, ఈ వైరస్‌కు సంబంధించిన ప్రత్యేకమైన మందుల కోసం ఇండెంట్ పెట్టామని, మందులు, పరీక్ష కిట్లు రావాల్సి ఉందని తెలిపారు. పరీక్షల కోసం వైరల్ ల్యాబ్, ఆర్టిపిసిఆర్ మిషన్ సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. చిన్నపిల్లలకు, వృద్ధులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో ప్రతిఒక్కరూ మాస్కు ధరించటం ద్వారా వ్యాధిని చాలా వరకు నియంత్రించవచ్చని తెలిపారు. శానిటైజర్ ఉపయోగించడం మంచిదన్నారు. ఈ వైరస్ గురించి కంగారు పడాల్సిన అవసరం లేదని, తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు అనుమానం ఉంటే వెంటనే ఆసుపత్రికి వచ్చి వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


ఉంగుటూరులో...

ప్రజాశక్తి - ఏలూరు

మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించుకుంటున్నట్లు బిఆర్.అంబేద్కర్ పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీ అన్నారు. భోగిమంటలు, రంగురంగుల ముగ్గులు, గాలిపటాలతో కోలాహలంగా పండుగను నిర్వహించారు. గంగిరెద్దు, హరిదాసుని వేషం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మన సంప్రదాయలు తెలుసుకోవాలన్నారు.

ఏలూరు అర్బన్ :స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ స్వామి వివేకానంద తన జీవితాంతం భారతదేశ ఔన్నత్యాన్ని చాటడానికి, యువతను మేల్కొలిపి దేశాభివృద్ధిలో వారిని భాగస్వాములు చేయడానికి కృషి చేశారన్నారు. అనంతరం కళాశాల సిపిడిసి మెంబర్ ఎల్.వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు మాట్లాడారు. తెలుగు అధ్యాపకులు ఎస్.పరమేశ్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

పోలవరంలో...

పోలవరం : మండలంలోని గూటాల గ్రామంలో గ్రామ సచివాలయం వద్ద సంక్రాంతి సంబరాలు పంచాయతీ కార్యదర్శి తాతి విజయకుమారి, పంచాయతీ ఉప సర్పంచి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి విజయకుమారి మాట్లాడుతూ ముగ్గుల పోటీలు ప్రారంభించి, భోగి మంటలు వెలిగించి సంబరాలు జరుపుకున్నట్లు చెప్పారు. పల్లె వాతావరణంలో బంధుమిత్రులతో ఆనందంగా సంక్రాంతి సంబరాలు జరుపుకోవాలని కోరారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులను ఉప సర్పంచి కరిబండి శ్రీను చేతుల మీదుగా అందించినట్లు తెలిపారు. అనంతరం ఎంపిడిఒ శ్రీనివాసరావు పలువురు నాయకులు, గ్రామస్తులు శాలువకప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

టి.నరసాపురంలో...

చాట్రాయి :సంక్రాంతి పండుగను పురస్కరించుకుని చాట్రాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు వేసిన ముగ్గులను పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంపిక చేశారు. ప్రథమ స్థానంలో టి.రేణుక, ఎన్.త్రిషలు నిలిచారు. ద్వితీయ స్థానంలో ఎ.అనూష, ఆర్.ప్రవళిక నిలిచారు. తృతీయ స్థానంలో టి.సుమిత్ర, డి.సుష్మ నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టి.నరసాపురం :విద్యార్థులకు చిన్న నాటి నుంచి సంస్కృతి సంప్రదాయాలు తెలియజేయాలని బండివారిగూడెం ఎంపియుపి పాఠశాల హెచ్‌ఎం డి.బాజా అన్నారు. స్థానిక పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి గ్రామానికి చెందిన నాళం నారాయణరావు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం అందించిన రూ.మూడు వేల నగదును అందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం డి.రాజా మాట్లాడుతూ విద్యార్థులు భారతీయ సాంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్‌లో...

ఉంగుటూరు : ఉషోదయ హైస్కూల్‌లో గురువారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. హరిదాసు వేషధారణలు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. పాఠశాల ప్రిన్సిపల్ గుణం బుల్లెబ్బాయి గీతావాణి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ :పట్టణంలోని త్రివిధ ఇంగ్లీష్ మీడియం స్కూలులో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాయసం చేసి చిన్నారులకు అందించారు. గంగిరెద్ల విన్యాసాలు, భోగి మంటలు పిల్లలను ఎంతగానో ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో త్రివిధ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వంగా ఇలాంటి పండగలు చిన్నారులకు తెలియజేయటానికి ఉపయోగపడతాయన్నారు. మతసామరస్యాలకు దూరంగా ఉంచుతాయని, పిల్లలందరూ కలిసిమెలిసి ఉండాలని, మన మతాన్ని పాటించాలి పర మతాన్ని గౌరవించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికతో ముందుకు

ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి ఒక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ చెప్పారు. గత వైసిపి ప్రభుత్వ ఖజానాను లూటీ చేసిందన్నారు. ఏలూరులోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో గురువారం సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎంపీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ సిఎం సహాయ నిధి నుంచి వైద్య ఖర్చుల నిమిత్తం 32 మంది లబ్ధిదారులకు మంజూరు చేసిన రూ.63 లక్షల చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏలూరులో ఎక్కడా పెద్ద పెద్ద పరిశ్రమలు లేవని, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గాన్ని పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు.

11న ఉచిత వైద్య శిబిరం

నూజివీడు టౌన్ :ఈ నెల 11వ తేదీ శనివారం రోజున నూజివీడు పట్టణంలో ఉచిత వైద్య శిబిరం శ్రీనివాస మహల్ సెంటర్‌లో ఉన్న ఎంపియుపి ఉర్దూ పాఠశాల వద్ద ఏర్పాటు చేయనున్నట్లు తిరివీధి లక్ష్మీరామారావు సేవా ట్రస్ట్ వ్యవస్థాపక ఛైర్మన్ తిరివీధి కృష్ణ తెలిపారు. నూజివీడులో ఆయన గురువారం మాట్లాడుతూ విజయవాడ నగరానికి చెందిన ఐ అండ్ జనరల్ కేర్ ఎన్ఎస్ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు చెప్పారు. అత్యవసర విభాగ వైద్యులు ఎస్‌కె.నాయబ్ రసూల్, కంటి చికిత్స నిపుణులు డాక్టర్ జమ్‌రుద్ షాహిన్ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. ఈ క్యాంపులను నూజివీడు పట్టణంలోని శ్రీనివాస మహల్ సెంటర్, తహశీల్దార్ కార్యాలయం, స్టేషన్ తోట, గాంధీనగర్, ముస్లిం బజార్ ప్రాంతాల్లోని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

CHANGE OF NAME

I, **SADANALA RAJESWARI** W/o. Sadanala Nageswara Rao D.No. 17-1-192/7, Kottapallivari Street, Rustumbada, Narsapuram, W.G.Dt. A.P. I have changed my name from **SADANALA RAJASREE** (Old name) to **SADANALA RAJESWARI** (New name) hence forth I am being called **SADANALA RAJESWARI** W/o. Sadanala Nageswara Rao for all purposes.

CHANGE OF NAME

I, IBBA JESURANI W/o. Karnati venkata Srinu and **Residing at D.No. 14-8-8,** 25th ward Doralaveedhi, Yagarlapalli,**TADEPALLIGUDEM** Phone No. 8333996688 Changing my Name from **RANI KARNATI ,** (OLD NAME) to **IBBA JESURANI** W/o. Karnati Venkata Srinu (NEW NAME) Hence forth I am being called as **IBBA JESURANI** (NEW NAME) for all purposes.

డాక్యుమెంట్ పోయినది

యలమంచిలి మండలం, మేడపాడుకు చెందిన యాడేపల్లి వెంకట రమేష్, తండ్రి: వెంకటేశ్వరరావు, డోర్ నెంబర్ 1-183 బహిరంగంగా తెలుపునది ఏమనగా మా కుటుంబానికి చెందిన స్థలం డాక్యుమెంట్ మా నానమ్మ యాడేపల్లి దమయంతి భర్త రామస్వామి ద్వారా మాకు సంక్రమించిన ఆస్థి డాక్యుమెంట్ నెంబర్ 6182/2005 నెంబర్ గల డాక్యుమెంట్ ది.26-12-2005లో పాలకొల్లు సబ్ రిజిస్టర్ ఆఫీసులో రిజిస్టర్ అయింది. దీనిని మా కుటుంబం అనుభవిస్తున్నాం. మా తండ్రి 2011లో మృతి చెందారు. దీనిని 14-5-2024న **డాక్యుమెంట్ నెంబర్ 9460/2024 గా** నకలు ద్వారా నా పేరు న ఆస్తి వచ్చింది. ఈ డాక్యుమెంట్ ను ది. 30-12-2024 న జిరాక్స్ తీయుటకు మేడపాడు లోని మా ఇంటి నుంచి గ్రామ సెంటర్‌లోని జెరాక్స్ సెంటర్‌కు వెళ్ళుతుండగా దారిలో పడిపోయింది. ఎంత వెతికినా నా ఒరిజినల్ డాక్యుమెంట్స్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికినా వీటిని మాకు అందజేయవలసినదిగా కోరి ప్రార్థిస్తున్నాను.

సెల్: 91602 00233

ప్రకటన

నా క్లయింటు దివ్యజ్ఞాన విద్యా సమితి (రి.నెం.12/1946), అశోక్‌నగర్, ఏలూరు యొక్క ప్రెసిడెంట్ అయిన శ్రీ వేణుగోపాల్ లునాని గారు ఇచ్చిన సమాచారం మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా - సదరు దివ్యజ్ఞాన విద్యాసమితి వారి యొక్క ఆస్తులు క్రయం చేయుటకు గాని, క్రొత్తగా కొనుగోలు చేయుటకు గాని, బైలాను సవరించుటకు ది.16-10-2024న ఏకగ్రీవ తీర్మానం యావన్మంది సభ్యులు చేసియున్నారు. సదరు తీర్మానం ప్రకారం బైలాను పొందుపరచుటకు ఏలూరు జిల్లా రిజిస్ట్రారు వారికి విన్నపము చేసియున్నారు. సదరు విషయమై అభ్యంతరముయున్న సభ్యులు క్రింద తెలియపరచిన వారికి లిఖిత పూర్వకముగా తెలియజేయగోర్తాము.

శెశెట్టి అప్పారావు, అడ్వకేటు, ఏలూరు.
సెల్: 8341885888

ఏలూరు నగరపాలక సంస్థ

ఆర్.ఓ.సి. నెం. 4041/2024-ఎ -1 తేది. 06-01-2025

బహిరంగ ప్రకటన

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో గల ఈ దిగువ ఉదహరించిన వివిధ మున్సిపల్ కాంప్లెక్స్‌లోని ఖాళీగా ఉన్న షాపు రూములు ఇహిరంగవేలము ద్వారా కేటాయించుటకుగాను ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 56, తేది.05-02-2011 మరియు ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 198, తేది.08-05-2012 నందలి నిబంధనలు మరియు పశ్చిమగోదావరి జిల్లా గెజిట్ సప్లిమెంటు సంఖ్య 76, తేది.23-08-2014 ప్రకారము ది. 22-01-2025 బుధవారం ఉదయం గం. 11-00 నుండి ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయము ఆవరణ యందు స్టీల్డ్ టెండర్ కమ్ పబ్లిక్ ఆక్షన్ నిర్వహించబడును.

అద్దె ప్రాతిపదికపై కేటాయించుటకు: .

1. వంగాయగూడెం చేపల చెట్టు మార్కెట్-8, 2. బాపూజీ కాంప్లెక్స్-3, 3. కందుల సూర్యం కాంప్లెక్స్-FF-1, 4. పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు North FF-3, 5.పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు South GF-1, 6.పాండురంగా కాంప్లెక్స్ 'A' బ్లాకు South FF-5, 7.పాండురంగా కాంప్లెక్స్ 'B' బ్లాకు South GF-7, 8.క్యాటిల్ డిపో FF-8, 9.కస్తూరిబా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్-2-3, 10. మెయిన్ రోడ్ షాపింగ్ కాంప్లెర్స్-1, 11. మెయిన్ ఫిష్ మార్కెట్-22, 12. గజ్జలవారి చెరువు బుద్ధా పార్క్-22, 13. ఆదివారపు పేట్ మార్కెట్ కాంప్లెక్స్-4,16 (SC) 14. చోడిదిబ్బ కాంప్లెక్స్-1, 15. ASR C బ్లాక్ GF-4, 16. ఆనంద్ కుమార్ కాంప్లెక్స్-1, 17. న్యూ ఫిష్ మార్కెట్-12, సీల్డ్ టెండర్స్ కోరడమైనది. DEO Complex-2 షాపులను బహిరంగావేలము నిర్వహించబడును. నగరపాలక సంస్థ వారు షాపుల వారీగా నిర్వయించిన సాంవత్సరిక అద్దెపై 10 శాతము ధరవత్తుగా చెల్లించవలయును. సాల్వెన్సీ-రూ. 1,00,000/- ,

గుడ్ విల్ పద్ధతిపై కేటాయించుటకు:

1. ఆదివారపు పేట్ మార్కెట్ కాంప్లెక్స్-13, గుడ్ విల్ రూ. 25,000/-, 2. లావేటి అప్పల స్వామి మార్కెట్-14, గుడ్ విల్ రూ. 25,000/- సాల్వెన్సీ-రూ. 1,00,000/-, 3. మెయిన్ పిష్ మార్కెట్-1, గుడ్ విల్ రూ. 1,45,000/-, రూ. 1,00,000/-, మెయిన్ పిష్ మార్కెట్-1, సాల్వెన్సీ-రూ. 1,50,000/- గుడ్ విల్ రూ. 1,00,000/-

ఇతర వివరములకు ఆఫీసు పని వేళలలో అడిగి తెలుసుకోనగలరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు: 7013187783, 9849907144, 9492974794.

సం/- **కమిషనరు,** ఏలూరు నగరపాలక సంస్థ